క్లుప్తంగా

విద్యార్థులే దేశానికి తరగని సంపద



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులే దేశానికి తరగని సంపద అని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్ ఆధ్వర్యంలో ఎంఎస్ఆర్ కన్వెన్షన్‌లో గురువారం బాలోత్సవ్–7ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ పిల్లలంటే ఎంతో ప్రేమగా మెలగిన చాచా నెహ్రూ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థుల దేశం గర్వించే పౌరులుగా ఎదగాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సుమేధ బాలోత్సవ్–7 పేరుతో నెల రోజుల నుంచి విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బాలల దినోత్సవ రోజున ముగింపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు మూడువేల బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ నాజియా బేగం, అయ్యప్ప, హరిత హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ శిరీష, ఆచార్య వీర రాఘవరావు, తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ రాంబాబు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు అభ్యుదయ కళాశాల విద్యార్థినుల ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కళాశాలలో ఐఎల్ఎం మేనేజ్‌మెంట్ సంస్థ గురువారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న 57 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి. రోహిణీదేవి తెలిపారు. కార్యక్రమంలో ఐఎల్ఎం అకడమిక్ డైరెక్టర్ రొనీలా కెల్‌రో, హెచ్ఆర్ మేనేజర్ సంజయ్ సుబ్రహ్మణ్యం, పాషా, కళాశాల డైరెక్టర్ బీఎస్ఆర్కే ప్రసాద్, ప్లేస్‌మెంట్ అధికారి వాణీ గ్రేస్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు

రూ.12.50 లక్షల అపరాధ రుసుం వసూలు

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ శాఖ విజిలెన్స్ పర్యవేక్షక ఇంజినీర్ ఎం.అల్ఫోన్స్, జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో అడవితక్కెళ్లపాడు, గోర్లవారిపాలెం, నల్లపాడు, మల్లవరం, తురకపాలెం, వీఆర్ కాలనీ తదితర ఏరియాలలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాసబాబు తెలిపారు. 54 మంది అధికారులు, 162 మంది సిబ్బంది, 54 బృందాలుగా ఏర్పడి 3,851 సర్వీసులను తనిఖీ చేసినట్లు చెప్పారు. అనుమతించిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 240 మందికి రూ.11.92 లక్షలు, మీటరు ఉన్నా అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ.52వేలు, అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న ఇద్దరికి రూ. 6వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. దాడుల్లో డీఈఈలు ఎస్.మల్లికార్జునప్రసాద్, బి.రాజమోహన్, ఏఈలు సతీష్, శివశంకర్, సుబ్బారావు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం



లక్ష్మీపురం: ఐక్య ఉద్యమాల ద్వారానే ప్రజలు, రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. గుంటూరు మల్లయ్య లింగంభవన్‌లోని వీఎస్‌కే హాలులో కార్మిక, ఉద్యోగ, రైతు, ప్రజా సంఘాల గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఓబులేసు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఈ నెల 26న జరిగే ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు గుంటూరు శంకర్‌లాస్ సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (సీపీఐ) జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, రైతు సంఘం(సీపీఎం) జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భౌభౌలతో వాకర్స్ బెంబేలు

ఎన్టీఆర్ స్టేడియంలో వీధి కుక్కల బెడద

- భయాందోళనలో వాకర్స్
- చోద్యం చూస్తున్న స్టేడియం సిబ్బంది, అధికారులు



స్టేడియంలో సందర్శకుల పక్కనే ఉన్న వీధి కుక్కలు



లక్ష్మీపురం: నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. ట్రాక్‌లో వాకింగ్, రన్నింగ్ చేసే వారు భీతిల్లుతున్నారు. కుక్కల బెడదతో ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అంటూ బిక్కు బిక్కుమంటూ వాకింగ్ చేస్తున్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ సెంటర్‌లో నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో ప్రతి రోజు వందల సంఖ్యలో నగరవాసులు వ్యాయామం చేసేందుకు వస్తుంటారు. ప్రధానంగా డాక్టర్లు, జిల్లాస్థాయి అధికారులు, విశ్రాంత అధికారులు, సీనియర్ సిటిజన్స్, వృద్ధులు, చిన్నారులు వాకింగ్ చేసి కొంత సేపు ఆహ్లాదకరమైన వాతావరణంలో కాలక్షేపం చేస్తుంటారు. సాయంత్రం చిన్నారులు క్రీడల్లో శిక్షణ కోసం వస్తుంటారు.

వాకర్స్‌పై దాడి

స్టేడియం ప్రాంగణంలో గత కొన్ని రోజులుగా కుక్కలు ఎక్కువై పోయాయి. వాకింగ్, రన్నింగ్ చేసే సయమంలో మీదకు రావడంతో పాటు వాకర్స్‌పై దాడి చేస్తున్నాయి. వాకింగ్ ట్రాక్ చుట్టూ కూడా పదుల సంఖ్యలో ఉంటున్నాయి. వాకర్స్ మధ్యలోకి వచ్చి అరవడంతో భయాందోళనకు గురవుతున్నారు. సాయంత్రం చిన్నారులు ఆడుకుంటున్నప్పుడు వారి వెంట పడుతున్నాయి. దీని వల్ల స్టేడియానికి రావాలంటే భయమేస్తోందని పలువురు వాపోతున్నారు. వ్యాయామ పరికరాల వద్ద కూడా కుక్కలు సంచరించడంతో భయం భయంతో చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్టేడియంలో లాంగ్ జంప్ రింగ్‌లో ఇసుక లేకపోవడంతో పాటు అందులో కుక్కలు ఉండటంతో లాంగ్ జంప్ శిక్షణ కోసం వచ్చే వారు కరువయ్యారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరుతున్నారు.



వాకింగ్ ట్రాక్‌లో..

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి



సమావేశంలో మాట్లాడుతున్న కోట మాల్యాద్రి, సీపీఐ నాయకులు

లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. కొత్తపేట మల్లయ్యలింగం భవన్‌లోని సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు నగరంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలంతో పాటు ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షల మంజూరు చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఒకటిన్నర సెంట్లు, పట్టణాల్లో సెంటు చొప్పున ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు పేద ప్రజలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత, అమలు విషయం మరిచారని ఆరోపించారు. పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణం కోసం సీపీఐ ఆధ్వర్యంలో అర్జీలు రాసే కార్యక్రమాన్ని ఈనెల 15న శారదా కాలనీలోని మామిళ్లపల్లి మాలకొండయ్య స్తూపం వద్ద నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. గుంటూరు నగరంలోని ఇల్లు లేని పేద ప్రజలు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నగర సీనియర్ నాయకుడు నూతలపాటి వెంకటేశ్వరరావు (చిన్న), నగర కార్యవర్గ సభ్యులు అకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం స్కూల్‌కు 40 బెంచీల వితరణ



మాట్లాడుతున్న రోటరీ క్లబ్ గుంటూరు వికాస్ అధ్యక్షులు ఆదిశేషు

కొరిటిపాడు(గుంటూరు): రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ సంయుక్త ఆధ్వర్యంలో కొరెటిపాడు ఆర్‌సీఎం యూపీ స్కూల్, విద్యార్థుల సౌకర్యార్థం 40 బెంచీలను గురువారం బాలల దినోత్సవం సందర్భంగా విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గుంటూరు వికాస్ అధ్యక్షులు పి. ఆదిశేషు, సెక్రటరీ సుధీర్ మాట్లాడుతూ కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ ప్రతినిధి, డేర్ ప్రాజెక్టు చైర్మన్ త్రిపురనేని మురళి ముఖ్య అతిథిగా హాజరు అవడం ఆనందంగా ఉందని తెలిపారు. స్కూల్‌కు బెంచీలు సమకూర్చడం వల్ల విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుంటూరు వికాస్, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ సంయుక్తంగా భాగస్వామి అయినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ డిప్యూటీ గవర్నర్ పి. శివరంజని మాట్లాడుతూ హైదరాబాద్ డెక్కన్ క్లబ్ డేర్ ప్రాజెక్టు ద్వారా ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నారని అభినందించారు. అసిస్టెంట్ గవర్నర్ కొల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్, హ్యాపీ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా, హైదరాబాద్ డెక్కన్ క్లబ్ సహకారంతో ఈ ప్రాజెక్టు చేపట్టినందులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు ఎద్దుల అనిల్ కుమార్, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

నేటి బాలలే భవిష్యత్తు సారథులు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో డైరెక్టర్ శ్రీవిద్య, ఇన్‌చార్జ్ వసంత లక్ష్మి.

గుంటూరు ఎడ్యుకేషన్: నేటి బాలలే భవిష్యత్తు రథసారథులని కెనడీస్ నెక్స్ట్‌జెన్ కిడ్స్ స్కూల్ డైరెక్టర్ కె. శ్రీక్రాంత్, డాక్టర్ కె.శ్రీవిద్య పేర్కొన్నారు. అరండల్‌పేటలోని పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం సందర్భంగా దేశ మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీక్రాంత్, శ్రీవిద్య మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వంటిందని తెలిపారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. పాఠశాల ఇన్‌చార్జి వసంత లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులందరూ స్నేహభావంతో మెలుగుతూ క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యతోపాటు, క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు శ్రీకాంత్, శ్రీవిద్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

కొరిటిపాడు(గుంటూరు): నేటి బాలలే రేపటి పౌరులని వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ సభ్యులు, దక్షిణ మధ్యరైల్వే సలహాదారుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ తెలిపారు. వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో జి.కె.రావు నగర్, పాత గుంటూరు నందు గల మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ స్కూల్ (నంబర్ 58)లో తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఆర్థిక సహాయం, స్పోర్ట్స్ కిడ్స్, అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులంతా క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం వల్ల భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదుగుతారని తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాశం సర్దార్ అభినంద్ యాదవ్, కోనంకి మురళీకృష్ణ యాదవ్, లక్ష్మీప్రసన్న, దుర్గాప్రవీణ్, సత్య, పాఠశాల హెడ్మాస్టర్ శివ నాగరాజు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజ్ఞ స్కూల్లో వేడుకలు

ప్రజ్ఞ స్కూల్లో బాలల దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంపాలెంలోని ప్రజ్ఞ స్కూల్లో గురువారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నెహ్రూ వేషధారణలో అలరించారు. ఆయన చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ ఎస్. చక్రనాగ్, ప్రిన్సిపాల్ ఎస్.కోటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నవభారత నిర్మాణానికి పండిట్ నెహ్రూ వేసిన పునాదులు చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కన్న స్కూల్లో వేడుకలు

గుంటూరు ఎడ్యుకేషన్: రైలుపేటలోని కన్న ఇంగ్లిషు మీడియం పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. బాలలంటే నెహ్రూకు ఎంతో ప్రేమ అని, ఆయన భావాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని ఉపాధ్యాయులు తెలిపారు. సరైన విద్యతోనే మెరుగైన సమాజాన్ని నిర్మించగలమని చెప్పిన నెహ్రూ ఆశయాలకు కట్టుబడి, ముందుకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమి నిర్వహిస్తోన్న కాజ సత్యవదేవి, లక్ష్మీనరసింహారావు మెమోరియల్ బాలకళావేదిక 12వ చిల్డ్రన్ డాన్ ఒలింపియాడ్ గురువారం సాయంత్రం మొదలైంది. పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. ప్రాథమిక స్థాయిలో 17 మంది కూచిపూడి నర్తకీమణులు కళా ప్రదర్శనను నిర్వహించారు. అందులో ఐదు ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి, బాలకళారత్న పురస్కారాలను అందించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి, సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజ వెంకటసుబ్రమణ్యం, కోశాధికారి నాగలక్ష్మీ పాల్గొనగా, ప్రపంచ రికార్డు విజేత బిక్కి తోషితను నాట్య నవ పల్లవం బిరుదుతో సత్కరించారు.



జీకేఆర్ స్కూల్లో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



జీకేఆర్ స్కూల్లో సాంస్కృతిక ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురం, ఏటీ అగ్రహారంలోని జీకేఆర్ స్కూల్ క్యాంపస్‌లలో గురువారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుంటూరు డీవైఈవో పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీమేధ డైరెక్టర్ అన్నా నందకిషోర్, రవి ఆస్పత్రి డైరెక్టర్ రవి, పాఠశాల డైరెక్టర్లు జి. కొండారెడ్డి, జనార్దన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ శైలజ, సుశీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారామయ్య స్కూల్లో వేడుకలు

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం విచిత్ర వేషధారణతో విద్యార్థులను అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో–ఆర్డినేటర్లు డి. దుర్గాశ్యామ్, టి. శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యార్థులు గొప్ప ఆశయాలను ఏర్పరచుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు గొప్ప ఆశయాలు, ధ్యేయాన్ని ఏర్పరచుకుని, వాటిని సాధించేందుకు కష్టపడి చదవాలని డీఆర్ఎం ఎం. రామకృష్ణ పేర్కొన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో గురువారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి పి. రామచంద్రరాజు, కోశాధికారి కె. రామ్‌సుభాష్, ప్రిన్సిపాల్ హేమాంబ, హెచ్ఎం కృష్ణ ఉష‌శ్రీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సీతారామయ్య స్కూల్లో విచిత్ర వేషధారణతో ఉపాధ్యాయినులు

కెనడీ స్కూల్లో వేడుకలు



నెక్స్ట్‌జెన్స్ కిడ్స్ విద్యార్థులతో శ్రీకాంత్‌బాబు, శ్రీవిద్య, హేమలత

గుంటూరు ఎడ్యుకేషన్: రాజేంద్రనగర్‌లోని నెక్స్ట్ జెన్ కిడ్స్, అరండల్‌పేటలోని కెనడీ ఇంగ్లిషు మీడియం స్కూల్ క్యాంపస్‌లలో గురువారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు చాచా నెహ్రూ వేషధారణతో అలరించారు. ఆటలు, పాటలతో ఆకట్టుకున్న చిన్నారులు భగవద్గీత శ్లోకాలను మధురంగా ఆలపించారు. జవహర్ లాల్ నెహ్రూ జీవిత విశేషాలను పాఠశాల డైరెక్టర్లు కె. శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ పీఎల్ హేమలత, ఐజాక్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలు



మహిళా బాలల గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లికార్జునరావు, గ్రంథాలయాధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని హాస్టల్ వెల్ఫేర్ అధికారి వై. మల్లికార్జునరావు తెలిపారు. బృందావన్ గార్డెన్స్ కుందుల రోడ్డులోని మహిళా బాలల గ్రంథాలయంలో శుక్రవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి హాస్టల్ వెల్ఫేర్ అధికారి వై. మల్లికార్జునరావు, గ్రంథాలయాధికారులు బి. శకుంతల, బి. సత్య శిరీష పూలమాల వేసి నివాళులర్పించారు. వారోత్సవాల్లో భాగంగా ఈనెల 21 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు గ్రంథ పాలకులు తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంసీపీఎస్, పీఎంసీ, ఎస్‌కే ఎంపీసీ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో పాటు సిబ్బంది పి. కోటేశ్వరి, పి. సుధాకర్, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనానికి పుస్తక పఠనం దోహదం



పుస్తకాన్ని పరిశీలిస్తున్న నగర కమిషనర్ శ్రీనివాసులు

నగరంపాలెం: మనిషి ప్రశాంత జీవితానికి పుస్తక పఠనం దోహదపడుతుందని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. విశాలాంధ్ర బుక్ హౌస్ 24వ పుస్తక మహోత్సవంలో భాగంగా లాడ్జి కూడలి ఏఎల్ బీఈడీ కళాశాల ప్రాంగణంలో గురువారం ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనను కమిషనర్ ప్రారంభించారు. తొలుత పుస్తక ప్రదర్శనను తిలకించి, పలు పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సుమారు నలభై మంది పబ్లిషర్స్ ప్రచురించిన అనేక రకాల పుస్తకాలు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి చైర్మన్ ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు వేలకొద్ది పుస్తకాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అభ్యుదయ రచయిత సంఘం(అరసం) జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, సీపీఐ జిల్లా, నగర కార్యదర్శులు జంగాల అజయ్‌కుమార్, కోట మాల్యాద్రి, విశాలాంధ్ర బుక్ హౌస్ జిల్లా మేనేజర్ బి.శ్రీనివాసులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ పిల్లల దగ్గర నుంచి పెద్దల వరకు మానసిక వికాసానికి ఉపయోగపడే పుస్తకాలు ప్రదర్శనలో ఉన్నాయని తెలిపారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, విశాలాంధ్ర విజ్ఞాన సమితి మాజీ జీఎం గూడవల్లి నాగేశ్వరరావు, సీనియర్ వైద్యురాలు చంద్ర రాధికారాణి, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, నాయకులు అరుణ్, హనుమంతరావు, జంగాల చైతన్య, యశ్వంత్, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

బస్సు ఎక్కుతూ జారిపడి యువకుడి దుర్మరణం

లక్ష్మీపురం: ఆర్టీసీ బస్సు వెనుక టైరు కింద పడి యువకుడు అక్కడిక్కడే మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. రేపల్లె ఖాజీపాలెం గ్రామానికి చెందిన చేబ్రోలు అఖిల్ (22) గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా అప్రెంటిస్ చేస్తుంటాడు. రేపల్లె వెళ్ళేందుకు గుంటూరు బస్టాండ్‌లోని ప్లాట్‌ఫామ్ నంబర్ 28 వద్ద బస్సు ఎక్కేందుకు వస్తున్న క్రమంలో కాలు జారీ వెనుక టైరు కింద పడ్డాడు. టైరు ఎక్కడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృత దేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీలకు స్పందన

కొరిటిపాడు(గుంటూరు): జేకేసీ కళాశాల గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గురువారం రాష్ట్రస్థాయిలో సెల్‌ఫోన్ వల్ల సమాజానికి లాభమా? నష్టమా? అనే సంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. 20 కళాశాలల నుంచి 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని నాగార్జునసాగర్ విజయపురి సౌత్‌లోని ఏపీఆర్‌డీసీ కళాశాలకు చెందిన జి.వంశీ, ద్వితీయ బహుమతిని విజయవాడలోని సిద్ధార్థ కళాశాలకు చెందిన బి.దుర్గాభవాని, తృతీయ బహుమతిని వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీకి చెందిన బి.కావ్యనాగిని గెలుచుకున్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, ప్రిన్సిపాల్ పరుచూరి గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ శరణు రామకృష్ణప్రసాద్ గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ ధ్రువపత్రం అందజేశారు. కళాశాల గ్రంథాలయ విభాగాధిపతి సీహెచ్. నాగభవాని, సిబ్బంది పాల్గొన్నారు.

• పేదలకు నిత్యావసరాల పంపిణీ

పెదకాకాని:జేఎంజే సంస్థ పేదలకు అండగా నిలుస్తుందని సంస్థ డైరెక్టర్ రెవరెండ్ సిస్టర్ మేరీకుమారి అన్నారు. మండలంలోని నంబూరు యానాదికాలనీ, తక్కెళ్ళపాడు, మహాలక్ష్మీ బాజీబాబా కాలనీలకు చెందిన 180 కుటుంబాలకు గురువారం సరుకులు పంపిణీ చేశారు. ముందుగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.